అండర్‌పాస్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

● మంత్రి కోమటిరెడ్డికి మల్‌రెడ్డి రాంరెడ్డి వినతి

ఎల్బీనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడ జాతీయ రహదారిపై పనామా గోడౌన్, ఆటోనగర్, హయత్‌నగర్ ప్రాంతాలలో నిర్మిస్తున్న అండర్‌పాస్‌లను ఎర్త్‌వాల్‌కు బదులుగా కాలం స్ట్రక్చర్‌తో నిర్మించడానికి అదనపు నిధులు మంజూరు చేయాలని తెలంగాణ రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి కోరారు. శుక్రవారం ఎర్రమంజిల్‌లోని ఆర్‌అండ్‌బీ భవనంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందనలతో ఆయన సమావేశమై పలు విషయాలపై చర్చించారు. అనంతరం నిధులు సమకూర్చాలని వినతిపత్రం అందజేశారు.


మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మేయర్ దుర్గ, కమిషనర్ చంద్రశేఖర్

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి: మేయర్ దుర్గ

సరూర్‌నగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 15వ డివిజన్ మిథిలానగర్‌కాలనీలో శుక్రవారం 'డ్రై ఫ్రైడే' సందర్భంగా పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్, కమిషనర్ చంద్రశేఖర్ డివిజన్‌లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానికులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించిన అనంతరం వారు మాట్లాడుతూ మీర్‌పేట్‌లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలతో పాటు వీధి మొత్తాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దానిని కనీస బాధ్యతగా భావించాలని వారు సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సూపర్‌వైజర్ ఇంద్రసేనారెడ్డి, కాలనీ ప్రతినిధులు హారతీ వెంకటేశ్వర్లు, ఫణిరాజ్ పాల్గొన్నారు.

'మాతృదేవోభవ' గిరికి పద్మ ప్రతిభా పురస్కారం

సరూర్‌నగర్: బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్‌లో గల మాతృదేవోభవ అనాథాశ్రమం నిర్వాహకుడు గట్టు గిరిని మరో అవార్డు వరించింది. అభాగ్యులకు ఎనలేని సేవలు చేస్తున్న ఆయనను.. 'మనం ఫౌండేషన్' వారు తమ సంస్థ 8వ వార్షికోత్సవం సందర్భంగా పద్మ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ క్రమంలో గురువారం రాత్రి నగరంలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సినీ నటుడు సుమన్, మాజీ ఎంపీ వేణుగోపాలాచారి తదితరులు ఆయనకు డాక్టరేట్‌తో పాటు పురస్కారం అందజేసి సత్కరించారు.


గిరికి అవార్డు అందజేస్తున్న సినీ నటుడు సుమన్, మాజీ ఎంపీ వేణుగోపాలాచారి

పార్కు ప్రహరీని ప్రారంభించిన కార్పొరేటర్

హయత్‌నగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని సిరిహిల్స్ కాలనీలోని పార్కు స్థలానికి నిర్మించిన ప్రహరీని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కాలనీవాసులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కాలనీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా అనేక కాలనీలకు చెందిన పార్కు స్థలాలను కొందరు కబ్జా చేసి క్రయ విక్రయాలు జరుపుతున్నారని అన్నారు. పార్కులను కబ్జా నుంచి కాపాడడానికి కృ షి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నందికొండ రవీందర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌నాయక్, నాయకులు వెంకటేశ్ గౌడ్, బాల్‌రెడ్డి, శంకర్‌గౌడ్, ఆనంద్‌రెడ్డి, మురళీ, సర్వేశ్వరచారి పాల్గొన్నారు.


పార్కు ప్రహరీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

బోనాల నిధులు 10శాతం పెంచడం హర్షణీయం

చాదర్‌ఘాట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులు 10శాతం పెంచడం హర్షణీయమని మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి అన్నారు. శుక్రవారం బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కార్యాలయంలో బోనాల నిధుల చెక్కులను డివిజన్ పరిధిలోని ఆలయ కమిటీ ప్రతినిధులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సురేఖ, గోవర్ధన్, ఆలయ కమిటీ సభ్యులు రవి, మురళీ, యాదగిరి, హరి, విజయ్, ఉమేష్ పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

వాకర్స్ సమస్యలను పరిష్కరించండి : కొప్పుల

వనస్థలిపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మన్సూరాబాద్ పెద్దచెరువులో ఉన్న వ్యర్థ పదార్థాలను త్వరితగతిన తొలగించి వాకర్స్ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మన్సూరాబాద్ పెద్దచెరువులో ఉన్న వ్యర్థ పదార్థాల మూలంగా చెరువు కట్టపై వాకర్స్‌కు దుర్వాసన రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాకర్స్ కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. కార్పొరేటర్ డీసీ తిప్పర్తి యాదయ్యతో కలిసి శుక్రవారం పెద్దచెరువును పరిశీలించారు. దుర్వాసనకు గల కారణాలను వెలికితీయాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. శనివారం వరకు సమస్యను పరిష్కరించాలన్నారు.


వాకర్స్ సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

ముద్రణాలయం ఏడీగా బాలకృష్ణ

సంతోష్‌నగర్ , జూలై 12 (ఆంధ్రజ్యోతి) : చంచల్‌గూడ ప్రభుత్వ ముద్రణాలయం అసిస్టెంట్ డైరక్టర్(ఏడీ) జీసీపీ-1గా బాలకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జంపాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఉద్యోగ జేఏసీ నేతలు కలిసి ఏడీని సన్మానించారు. ముద్రణాలయం ఉద్యోగుల పెండింగ్ సమస్యలు, పదోన్నతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించినట్లు జేఏసీ నేతలు తెలిపారు.


ఏడీ బాలకృష్ణను సన్మానిస్తున్న ఉద్యోగ జేఏసీ నేతలు

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం

హయత్‌నగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు ఇందిర ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, శ్రీలత, సీతాలతలను విద్యార్థులు, ఉపాధ్యాయులు వారి సేవలను గుర్తు చేసుకుని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌తో పాటు పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'భూ' మాయ!

● రూ.300 కోట్ల విలువైన భూమికి రెక్కలు
● నిషేధిత జాబితాలో ఉన్నా.. పాస్‌పుస్తకాలు జారీ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

నగర శివార్లలోని దాదాపు రూ.300 కోట్లకు పైగా విలువ చేసే 33.08 ఎకరాల పోరంబోకు భూములకు రెక్కలు వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న ఈ విలువైన భూములకు కొత్త పాస్‌బుక్‌లు జారీ చేసిన వ్యవహారం అలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఫిర్యాదు రావడంతో భూమిపై జిల్లా కలెక్టర్ శశాంక ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. మహేశ్వరం మండలం మంఖాల్‌లోని 608, 609, 610 సర్వే నంబర్లలో 33.08 ఎకరాల భూమిని 22ఏ కింద గతంలో నిషేధిత జాబితాలో పెట్టారు. 1996 నుంచి ప్రభుత్వ రికార్డుల్లో ఈ భూమి పోరంబోకు/గైరానా సర్కారీగా నమోదైంది. ఈ భూముల క్రయవిక్రయాలు జరగకుండా 2012లో అప్పటి రెవెన్యూ అధికారులు 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం వెబ్‌సైట్‌లో కూడా ఇప్పటికీ ఈ భూమి నిషేధిత జాబితాలోనే ఉంది. అయితే, గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు ఈ భూములకు రెక్కలు వచ్చాయి. ఈ భూమి మొత్తం పట్టా భూమిగా మారిపోయింది. దీనికి సంబంధించిన ఫైళ్లన్నీ సచివాలయం వరకు కదిలాయి. కొందరి పేరు మీద పాస్‌బుక్‌లు కూడా ఆగమేఘాలపై జారీ చేశారు. కొందరు రాజకీయ నేతలు, రియల్ ఎస్టేట్ సంస్థల పేర్ల మీదకు ఈ భూమి మారింది. ప్రభుత్వం మారడంతో దీనిపై స్థానికులు మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. కొందరు బడా రాజకీయ నేతలు, రియల్ వ్యాపారులు కలిసి ఈ భూములు కొల్లగొట్టారని దీనిపై విచారణ జరపాలని ఆయన ప్రభుత్వానికి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ శశాంక ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. భూ వివాదాలకు సంబంధించి జిల్లాలో ఇప్పటికే పనిచేస్తున్న రెండు టాస్క్‌బృందాల్లో ఒక బృందానికి విచారణ బాధ్యతలు అప్పగించారు. భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు నేతృత్వంలోని రెవెన్యూ అధికారులు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టారు. ఇదిలా ఉంటే ఇదే సమయంలో స్థానిక తహసీల్దార్ విజయలక్ష్మి సెలవులో వెళ్లడంతో తాత్కాలికంగా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న రాజశేఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మొత్తం ఈ వ్యవహారంపై డిప్యూటీ కలెక్టర్ రాజు, ఇన్‌చార్జి తహసీల్దార్ రాజశేఖర్ లోతుగా విచారణ జరుపుతున్నారు. మొత్తం ఈ భూమి వ్యవహారంపై రెండు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.

1975నుంచి రికార్డులు గల్లంతు

మంఖాల్‌లోని ఈ భూములకు సంబంధించిన రికార్డులు కొన్ని గల్లంతైనట్లు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. అయితే తొలుత ఈ భూమి సేత్వారీలో పట్టాగా ఉన్నట్లు కొందరు చెబుతున్నారు. తరువాత కొన్నాళ్ల ప్రభుత్వ రికార్డుల్లో అలానే కొనసాగినప్పటికీ 1975నుంచి ఈ సర్వే నంబర్‌కు సంబంధించిన రికార్డులు గల్లంతయ్యాయి. అనుభవదారుల కాలమ్‌లో కొందరు వ్యక్తుల పేర్లు కొనసాగాయి. అయితే, 1996 నుంచి ప్రభుత్వ రికార్డుల్లో పోరంబోకు/సర్కారీ గైరానా అని నమోదవుతూ వస్తోంది. చివరకు 2012లో అప్పటి రెవెన్యూ అధికారులు 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. దీంతో ఈ భూముల జోలికి ఎవరూ వెళ్లలేదు. కానీ, కొందరు పేర్లు మాత్రం అనుభవదారుల కాలమ్‌లో రాశారు. సేత్వారీలో గతంలో పట్టాగా నమోదైందని చెబుతూ దీని ఆధారంగానే మిగతా వ్యవహారమంతా నడిపి ఫైల్ క్లియర్ చేసుకున్నట్లు తెలిసింది.

పార్కుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

వనస్థలిపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పార్కుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్ నార్త్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు పార్కు ను సందర్శించారు. ఈ మేరకు పార్కులో చిల్డ్రన్ ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్‌పై టైల్స్ ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయించాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసుల సౌకర్యార్థం పార్కులో చిల్డ్రన్ ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్‌పై టైల్స్ ఓపెన్ జిమ్‌లను అతి త్వరలోనే ఏర్పాటు చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందరెడ్డి, కాలనీ అధ్యక్షులు పోగుల రాంబాబు, అనిల్‌చౌదరి, సతీష్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, నాగరాజు, ఆదిత్య, వేణుగోపాల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

వనస్థలిపురం: పేదల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ మమతనగర్‌కు చెందిన వంశీకృష్ణ కేన్సర్‌తో బాధపడుతున్న నేపథ్యంలో వారి ఆర్థికస్థితి బాగలేకపోవడంతో ఎమ్మెల్యే సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అందుకు గాను మంజూరైన రూ.2లక్షల ఎల్‌ఓసీ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో గుత్తా లక్ష్మారెడ్డి, కొత్త శివ ముదిరాజ్, చీర శ్రీనివాస్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సరూర్‌నగర్ ప్రజల సమస్యలను పరిష్కరించాలి

● జోనల్ కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఎల్బీనగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ డివిజన్ నాయకులు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కోరారు. కాంగ్రెస్ నాయకులు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌తో సమావేశమై పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో రోడ్లు గుంతలమయమై ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరూర్‌నగర్ పక్కనే సరూర్‌నగర్ చెరువు మురికికూపంగా మారడంతో బాపూనగర్, ఓల్డ్ సరూర్‌నగర్, శివాలయం, రామాలయం, పోచమ్మబస్తీ, కుమ్మరిబస్తీ, చెరుకుతోటకాలనీ, అంబేద్కర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, శంకర్‌నగర్, ఇంద్రహిల్స్, డాక్టర్స్‌కాలనీ, సాయికృష్ణనగర్, జేబీకాలనీ, వికాస్‌నగర్, హుడా ఎంప్లాయీస్ కాలనీ పరిసర ప్రాంతాలలో దోమలు వీరవిహారం చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దోమలకాటుతో విషజ్వరాల బారిన పడే ప్రమాదమున్నదన్నారు. ఆయా ప్రాంతాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు జడ్సీని కోరారు. జోనల్ కమిషనర్‌ను కలిసిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోయిని మహేందర్‌యాదవ్, బేర బాలకిషన్, శంకర్‌యాదవ్, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, అరుణమ్మ, సంగీత, ఇమ్రాన్‌అలీ, యాదయ్యయాదవ్, యూనస్, పుష్ప ఉన్నారు.


కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌తో సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి: రాంరెడ్డి

చంపాపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి కోరారు. హస్తినాపురం డివిజన్‌లోని ఇంద్రప్రస్థకాలనీ-1లో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ సుజాతా నాయక్ హాజరై పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ రావు, సత్యనారాయణ, జీహెచ్‌ఎంసీ ఏఈ హేమునాయక్, గణేష్, గోపీ, టీపీసీసీ అధికార ప్రతినిధి వెదిరె యోగేశ్వర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు రాంరెడ్డి, యాదగిరిరెడ్డి, మురళి, కాంగ్రెస్ నాయకులు శశిధర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వనమహోత్సవంలో మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ సుజాతానాయక్

ఇబ్రహీంపట్నం టూ హయత్‌నగర్‌కు బస్సు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం నుంచి వయా అనాజ్‌పూర్ మీదుగా హయత్‌నగర్ వరకు ఏర్పాటు చేసిన నూతన బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులతో కలిసి గ్రామస్థులు పూజలు చేసి శుక్రవారం ప్రారంభించారు. రోడ్డు మరమ్మతుల కారణంతో కొంత కాలంగా ఈ రూట్‌లో అధికారులు బస్సు సర్వీసును నిలిపివేశారు. ఈ విషయాన్ని గ్రామస్థులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే పట్నం ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సర్వీసును తిరిగి ప్రారంభించాలని కోరారు. దాంతో శుక్రవారం అధికారులు సర్వీసును తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా అనాజ్‌పూర్ గ్రామస్థులు బస్సుకు పూజలు చేసి ఎమ్మెల్యే మల్‌రెడ్డికి, అధికారులను కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఏళ్ల బాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలంయాదవ్, శివయ్య, రాంరెడ్డి, నర్సింహ, నర్సిరెడ్డి, సామయ్య, సత్తయ్య, బాలకృష్ణగౌడ్ పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం సందర్భంగా అధికారులతో గ్రామస్థులు

ఎన్నికల్లో బీజేపీ మంచి ఫలితాలను సాధించింది

సైదాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్‌ఎస్ కుమ్మక్కై తప్పుడు ప్రచారాలు చేసినా ఎన్నికల్లో బీజేపీ మంచి ఫలితాలను సాధించిందని నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ అన్నారు. వినయ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో భాగ్యనగర్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి వీరేందర్‌బాబుయాదవ్ అధ్యక్షతన యాఖత్‌పురా నియోజకవర్గం ఓటర్ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్‌చందర్జీ మాట్లాడుతూ తెలంగాణలో భవిష్యత్ బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. ఐదు నెలల్లో 14శాతం నుంచి 35 శాతానికి ఓట్‌షేర్‌ను పెంచుకున్నట్లు వివరించారు. వీరేందర్ బాబు మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో పాతబస్తీలో ఓటర్లు రాజకీయాలకు అతీతంగా బీజేపీని ఆదరించారని తెలిపారు. కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సహదేవ్ యాదవ్, నియోజకవర్గ కన్వీనర్ బండ వెంకట్‌రెడ్డి, నాయకులు నిరంజన్‌యాదవ్, శంకరాచారి, సందీప్‌సాగర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో భవనంపైకి ఎక్కి ఆత్మహత్యాయత్నం

● క్షేమంగా కిందికి దించిన చైతన్యపురి పోలీసులు

దిల్‌సుఖ్‌నగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించవద్దని భార్య పిల్లలు తిట్టారనే కోపంతో నిర్మాణంలో ఉన్న భవనంపైకి ఎక్కి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని పోలీసులు రక్షించారు. ఈ సంఘటనకు సంబంధించి చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాబాద్‌కు చెందిన తాళ్లపల్లి రమేష్(45) సెంట్రింగ్ పనులు చేస్తూ, జీవనం సాగిస్తున్నాడు. కాగా నిత్యం మద్యం సేవిస్తున్న రమేష్‌ను మద్యం తాగవద్దని శుక్రవారం భార్య, పిల్లలు మందలించారు. దీంతో ఆగ్రహానికి గురైన రమేష్ మద్యం సేవించి, తాను పనిచేసే చైతన్యపురి విద్యుత్‌నగర్‌కు వచ్చాడు. అక్కడ నిర్మాణంలో ఉన్న భవనం మూడవ అంతస్తు తాగునీటి ట్యాంక్‌పైకి ఎక్కాడు. అక్కడ నుంచి కిందకు దూకి చనిపోతానంటూ కేకలు వేశాడు. అతని అరుపులు విన్న చుట్టుపక్కల వారు పోలీస్ కంట్రోల్‌రూం 100కు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. దీంతో చైతన్యపురి పోలీసులు అక్కడకు చేరుకుని అతన్ని మాటల్లో పెట్టి, వెనుక నుంచి తాగునీటి ట్యాంక్‌పైనుంచి రమేష్‌ను క్షేమంగా కిందకు దించారు.


రమేష్‌ను క్షేమంగా కిందికిదించి తీసుకెళ్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు


చాదర్‌ఘాట్‌లోని అషూర్ ఖానా బైతుల్ హుజున్‌ను సందర్శిస్తున్న సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్, అడిషనల్ డీసీపీ స్వామి

బీబీకా ఆలం ఊరేగింపునకు 150 మంది పోలీసులతో బందోబస్తు

● సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్

చాదర్‌ఘాట్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భంగా బీబీకా ఆలం ఊరేగింపులో ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా 150 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం డీసీపీతోపాటు అడిషనల్ డీసీపీ స్వామి, మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజుతో కూడిన పోలీస్ అధికారుల బృందం బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించింది. బీబీకా ఆలం ఊరేగింపు ముగియనున్న చాదర్‌ఘాట్‌లోని అషూర్ ఖానా బైతుల్ హాజున్‌ను డీసీపీ సందర్శించారు. బీబీకా ఆలం ఇక్కడికి చేరుకోవడంతో ఊరేగింపు ముగుస్తుందని డీసీపీకి ఊరేగింపు నిర్వాహకులు తెలిపారు. అనంతరం తిరిగి బీబీకా ఆలం వెళ్తుందన్నారు. చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారి పొడవునా పోలీస్ బందోబస్తుతో పాటు అడుగడుగునా పోలీస్ నిఘా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.


సమావేశంలో ప్రొఫెసర్ కోదండరాం, విమలక్క, సత్యనారాయణగుప్తా

సకల జనుల సమష్టి పోరాటాలతోనే తెలంగాణ

● ఉద్యమకారుల ఆత్మీయ సమావేశంలో ప్రొఫెసర్ కోదండరాం

ఎల్బీనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సకల జనుల సమష్టి పోరాటం ద్వారానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, ఏ ఒక్కరి వల్ల కాదని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ కాచం సత్యనారాయణగుప్తా అధ్యక్షతన శుక్రవారం కొత్తపేటలో ఉద్యమకారుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ ఉద్యమ సంఘాలను ఒకే జేఏసీగా ఏర్పాటు చేసుకుందామని సూచించారు. ఎల్బీనగర్‌లో జరిగిన సంఘటనలను పుస్తక రూపంలో తీసుకువచ్చి ప్రజలకు అందించాల్సిన బాధ్యత ఉద్యమకారులపై ఉందన్నారు. సత్యనారాయణగుప్తా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు కేవీ రంగారెడ్డి, కప్పాటి పాండు రంగారెడ్డి, పల్లె వినయ్‌కుమార్, బీరెల్లి వెంకట్‌రెడ్డి, శ్రీనివాసాచారి, శ్రవణ్, ఖలీల్, కాచం సుష్మ, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రూట్లలో బస్సులు

● 16 హెచ్/49 ఎం రూట్‌లో ఈనెల 15 నుంచి..
● ఈసీఐఎల్ నుంచి మెహిదీపట్నంకు 4 మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో కొత్త రూట్లలో ఆర్టీసీ బస్సులు అందుబాటులోకి తెచ్చేదిశగా చర్యలు తీసుకుంటున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 15 నుంచి 16 హెచ్/49ఎం రూట్‌లో ఈసీఐఎల్ నుంచి మెహిదీపట్నంకు 4 మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు. ఈసీఐఎల్ నుంచి ఉదయం 7గంటలకు మొదటి బస్సు, మెహిదీపట్నం నుంచి మొదటి బస్సు ఉదయం 8.35 నిమిషాలకు ఉంటుందన్నారు. ఈ రూట్‌లో 45 నిమిషాలకు ఓ బస్సు అందుబాటులో ఉంటుందని ప్రయాణికులు ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈసీఐఎల్ నుంచి వయా సర్దార్ పటేల్‌నగర్, యునాని ఆస్పత్రి, ఇందిరానగర్, వసుందర డిగ్రీకాలేజీ, ప్లేగ్రౌండ్, యూనియన్ కార్బైడ్, జెడ్‌టీఎస్, ఎన్‌ఎండీసీ కాలనీ, ఈస్ట్ ఆనంద్‌బాగ్, సాయినగర్, మల్కాజిగిరి, మిర్జాల్‌గూడ, న్యూబిడి, మెట్టుగూడ, అలుగడ్డబావి, చిలకలగూడ ఎక్స్‌రోడ్, సికింద్రాబాద్, సంగీత్, ప్లాజా, పోలీస్‌లైన్స్, ఆర్‌జేకాలేజీ, పంజాగుట్ట, రోడ్ నెం.7, మాసబ్ ట్యాంక్, మెహిదీపట్నంకు సర్వీసులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

చంపాపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని మాధవనగర్‌కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.93లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం కాలనీ ప్రతినిధులతో కలిసి బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముదుపు రాజ్‌కుమార్‌రెడ్డి సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహకారంతో కాలనీలలో నెలకొన్న ఇతర సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్, కాలనీ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, నాయకులు బొంబాయి, రాజశేఖర్‌రెడ్డి, సత్తిరెడ్డి, బెనర్జీ పాల్గొన్నారు.

లెప్రసీ బాధితులకు మెడికల్ కిట్ల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 12(ఆంధ్రజ్యోతి): నేషనల్ థర్మల్ పవర్ కార్పోరేషన్(ఎన్‌టీపీసీ) ప్రతినిధుల సహకారంతో స్లాప్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్, సంతోష్‌నగర్ కాలనీల్లో లెప్రసీ బాధితులకు మెడికల్ కిట్స్, టబ్బులను పంపిణీ చేశారు. స్థానిక కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతివిజయేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బాధితులకు మెడికల్ కిట్లను అందజేశారు. మందులను జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్‌టీపీసీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సామేల్ పాల్గొన్నారు.

శంషాబాద్ సభకు తరలిన బీజేపీ నేతలు

సరూర్‌నగర్: శంషాబాద్‌లోని మల్లికా కన్వెన్షన్‌లో శుక్రవారం నిర్వహించిన బీజేపీ రాష్ట్రస్థాయి కార్యకర్తల సమావేశానికి మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల నుంచి ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములుయాదవ్, కొలన్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. నాదర్‌గుల్ నుంచి ప్రారంభమైన ర్యాలీని అందెల ప్రారంభించారు. అనంతరం శంషాబాద్‌లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఆయన సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అందెల, కొలన్ మాట్లాడుతూ తెలంగాణలో భవిష్యత్ బీజేపీదేనని, బీఆర్‌ఎస్ మూతపడిన పాత పరిశ్రమలాంటిదని అన్నారు. ఇక కాంగ్రెస్ తన ఎన్నికల హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిందని, రాష్ట్రాన్ని మరింతగా అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నదని వారు ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.


ఈటలతో కలిసి సభలోకి వెళ్తున్న శ్రీరాములుయాదవ్